# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమీక్ష నిర్వహించారు.

- ఉద్యోగులు నిష్పక్షపాతంగా, నిబద్ధతతో వ్యవహరించాలని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

- సివిల్స్ కు సన్నద్ధమయ్యే అభ్యర్ధులకు బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా ఉచిత శిక్షణ అందించేందుకు నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షా ఫలితాలను మంత్రి ఎస్ సవిత విడుదల చేశారు.

- గర్భిణులు, చిన్నారులకు అందిస్తున్న సేవలను మరింత మెరుగుపరిచేందుకు 58,402 మంది అంగన్‌వాడీ సిబ్బందికి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు.

====================

ఖరీఫ్ సీజన్ కి సంబంధించిన ధాన్యం కొనుగోళ్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలోని సచివాలయంలో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు వ్యవసాయ శాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడు, పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యవసాయ శాఖ, పౌరసరఫరాలు, ఆర్ధిక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ ఏడాది మొత్తంగా 50.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. అందులో భాగంగా 23 జిల్లాల్లో ఇప్పటి వరకు 18.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే 32 శాతం మేర ధాన్యం కొనుగోళ్లు పెరిగాయని చెప్పారు. మొత్తం 2వేల 606 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపే 4,085 కోట్ల రూపాయల మేర చెల్లింపులు చేశామని పౌరసరఫరాల శాఖ అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు.

====================

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉద్యోగులు నిష్పక్షపాతంగా, నిబద్ధతతో వ్యవహరించాలని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. ఆ శాఖల ఉద్యోగులతో నిర్వహించిన మాటా-మంతి కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పాల్గొని వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికే నూతన సంస్కరణలను తీసుకొచ్చామన్నారు. అందులో భాగంగానే గతంలో ఎన్నడూ లేని విధంగా 10 వేల మందికి పైగా పదోన్నతులు కల్పించామన్నారు. ఒక ప్రమోషన్ వస్తే ఆ ఉద్యోగి ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంటుందని వారు మరింత ప్రభావవంతంగా పనిచేస్తారని పేర్కొన్నారు. పదోన్నతుల ఆనందం ప్రజలకు అందించే సేవల్లో కనబడాలని పవన్ కళ్యాణ్ అధికారులకు స్పష్టం చేస్తూ...

(వాయిస్…30 సెకన్లు)

====================

సివిల్స్ కు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా ఉచిత శిక్షణ అందించేందుకు నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షా ఫలితాలను బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవిత ఈరోజు విడుదల చేశారు. రాష్ట్ర సచివాలయంలోని ప్రచార విభాగంలో ఫలితాల విడుదల అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ నెల 7వ తేదీన రాష్ట్రంలోని 7 కేంద్రాలలో ఈ పరీక్ష నిర్వహించగా 723 మంది అభ్యర్థులు హాజరయ్యారని వారిలో 100 మంది అభ్యర్థులను ఎంపిక చేశామని చెప్పారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం 100 మందితో కూడిన తుది జాబితాను సిద్ధం చేశామని 2026 సివిల్స్ పరీక్షలకు వారికి ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి మెగా డీఎస్సీతో పాటు పలు పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నామని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్...30 సెకన్లు)

====================

గర్భిణులు, చిన్నారులకు అంగన్‌వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలను మరింత మెరుగుపరిచేందుకు రాష్ట్ర మహిళా శిశు అభివృద్ధి సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. విజయవాడలో ఈరోజు జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 58,402 మంది అంగన్‌వాడీ సిబ్బందికి 12,500 రూపాయల విలువైన 5జీ మొబైల్ ఫోన్లను మంత్రి అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ కొత్త ఫోన్లతో అంగన్‌వాడీ కార్యకర్తలకు పని భారం తగ్గుతుందన్నారు. వీటితో సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందజేయగలరని, పాత ఫోన్ల వల్ల ఎదురవుతున్న సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్లు ఉపయోగిస్తున్న సాధారణ మొబైల్ ఫోన్లు పిల్లల రోజువారీ హాజరు, సరుకుల రవాణా, వారి ఆరోగ్యం, బరువు, ఎత్తు వంటి సమాచారాన్ని నమోదు చేయడానికి అనువుగా లేవని ఈ సమస్యను అధిగమించడానికి అంగన్‌వాడీ టీచర్లకు 5G ట్యాబ్‌లను పంపిణీ చేశామని తెలిపారు. ఈ చర్యల ద్వారా రాష్ట్రంలోని అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు.

====================

విరామం

====================

రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ స్పష్టం చేశారు. చిత్తూరు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన, విద్య, వైద్యం, మున్సిపాలిటీల్లో మౌలికవసతుల కల్పన తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో ఆయన ఈరోజు సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతీ ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వర్ణాంధ్ర - వికసిత్ భారత్ లక్ష్యంగా నిధులను విరివిగా పథకాలకు అందజేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వాల చొరవతో అన్ని వర్గాల వారికి మంచి జరగాలనే లక్ష్యంతోనే పరిపాలన సాగిస్తున్నామని లంకా దినకర్ తెలియజేస్తూ...

(వాయిస్...30 సెకన్లు)

====================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 12వ తేదీ శుక్రవారం విశాఖపట్టణంలో పర్యటించనున్నారు. మధురవాడలోని ఐటీ హిల్స్ పై కాగ్నిజెంట్ కంపెనీ ఏర్పాటుకు సంబంధించి శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ఈ నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఈరోజు పరిశీలించారు. కలెక్టరేట్లో సమీక్ష అనంతరం నిర్వహించిన ఏఎస్ఎల్ (అడ్వాన్స్డ్ సెక్యూరిటీ లైజనింగ్)లో భాగంగా కార్యక్రమాలు జరిగే వేదికలను సందర్శించారు. అనంతరం రుషికొండలోని ఏ-1 గ్రాండ్ కన్వెన్షన్ హాలును పరిశీలించారు. అక్కడ జరగనున్న వైజాగ్ ఎకనామిక్ రీజియన్ సమావేశం, ఇతర అంశాలపై అధికారులకు వారు దిశానిర్దేశం చేశారు.

====================

బాల్య వివాహాలను నిర్మూలించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని రంపచోడవరం తాసిల్దార్ పి. బాలాజీ అన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో బాల్య వివాహాలు నిర్మూలించే విధంగా అంగన్వాడి సూపర్వైజర్లతో స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో ఈరోజు ఆయన ఇతర అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పి. బాలాజీ మాట్లాడుతూ మహిళ, శిశు సంక్షేమ శాఖ ద్వారా ప్రతి గ్రామంలో బాల్య వివాహాలను అరికట్టాలని అన్నారు. బాలల పరిరక్షణ, బాలల సమస్యలు, సైబర్ సెక్యూరిటీపై ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాలని బాల్య వివాహాల రహిత భారతదేశానికి అందరం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు.

=====================

ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా విజయనగరం జిల్లా కోర్టు ఆవరణలో న్యాయ సహాయ శిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హింస, వివక్ష, బలహీనవర్గాలపై జరుగుతున్న హక్కుల ఉల్లంఘనలను అరికట్టడంలో విద్యార్థులు, పౌర సమాజం, ప్రభుత్వ యంత్రాంగం సమష్టిగా కృషి చేయాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సహాయం చేస్తుందని, పౌర హక్కులను కాపాడటంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ముందుంటుందని చెప్పారు. కక్షిదారుల సందేహాలను, సమస్యలను పరిష్కరించడానికి ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల చరిత్ర, రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులు, బాలలు, మహిళలు, దివ్యాంగుల హక్కులు న్యాయ సహాయం లభ్యత వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

=====================

ఉత్తర, దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ లో రానున్న రెండు రోజుల పాటూ పొడి వాతావరణం ఏర్పడే  అవకాశము  ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణములో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని వెల్లడించింది.

=====================

నంద్యాల జిల్లాలో డిసెంబర్ 21వ తేదీన ప్రపంచ పల్స్ పోలియో కార్యక్రమం జరగనుందని దీనిని విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి (డిఎంహెచ్ఓ) వెంకటరమణ కోరారు.

=====================
=====================